www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 6 అక్టోబర్ 2024
5
చిత్తూరు



ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలి


- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి
- రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం 42 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు కోసం 7వ తేదీ సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని శనివారం జరిగిన అంగన్వాడీ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ సమావేశంకు జిల్లా అధ్యక్షురాలు లలిత అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించక పోవడంతో 42రోజులు పాటు సమ్మె చేయడం జరిగిందని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత అధికారంలో ఉన్న పార్టీ నాయకులు అంగన్వాడీలకు మద్దతు ఇస్తూ తాము అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అయినా ఇప్పటివరకు అంగన్వాడీ సమస్యలపై ఎలాంటి పురోగతి లేదన్నారు. ప్రధానంగా ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని, మినీసెంటర్ల మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రాజెక్టుల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా సమన్వయకమిటీ సమావేశం ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఇప్పటికే అనేకసార్లు అధికారులకు విన్నవించినా స్పందించకపోవడంతో 7న నిరసన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని అంగన్వాడీలు మినీ అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి బెదిరింపులకు పాల్పడకుండా ఉండాలని లేనిపక్షంలో జరిగే పరిణామాలకు అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, నాయకులు విజయ, శ్యామలమ్మ, బేబీ, శోభ, ఎర్రమ్మ, సరళ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అంగన్వాడీలు


వకుళమాత వంటశాల ప్రారంభించిన చంద్రబాబు


టిటిడి అధికారులతో చంద్రబాబు సమీక్ష

తిరుమలలో విఐపి సంస్కృతి తగ్గాలి

టిటిడి అధికారులు సమీక్షలో చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా ప్రతి ఒక్కరు పనిచేయాలని, కొండపై గోవింద నామస్మరణ తప్ప, మరోమాట వినిపించకూడదని, విఐపి సంస్కృతి తగ్గాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. పద్మావతి అతిథిగృహంలో ముఖ్యమంత్రి టిటిడి అధికారులతో శనివారం సమీక్షించారు. చంద్రబాబు మాట్లాడుతూ తిరుమలలో ప్రశాంతతకు ఎక్కడా భంగం కలగకూడదని, ఏ విషయంలోనూ రాజీపడొద్దని అన్నారు. భక్తుల సూచనలు, సలహల ఆధారంగా సేవలపై టిటిడి పనిచేయాలన్నారు. అన్ని దేవాలయాల్లోనూ భక్తుల అభిప్రాయాలను తీసుకునే విధానాన్ని తీసుకురావాలన్నారు. లడ్డూ ప్రసాదం, అన్నప్రసాదం నాణ్యత ఎల్లప్పుడూ కొనసాగాలన్నారు. తిరుమల పేరు తలిస్తే ఏడుకొండలవాని వైభవం, ఆధ్యాత్మికత మాత్రమే చర్చకు రావాలన్నారు. స్విమ్స్ సేవలు మెరుగుపడాలన్నారు. భవిష్యత్ నీటి అవసరాలకు తగినట్టు ముందస్తు ప్రణాళిక అవసరం అన్నారు. అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80శాతం పైగా పెంచాలని సూచించారు.

కేంద్రీకృత వకుళమాత వంటశాల ప్రారంభం

తిరుమలలో కేంద్రీకృత వకుళమాత వంటశాలను సిఎం చంద్రబాబు ప్రారంభించారు. 1.2 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించే వీలుగా ఈ వంటశాలను ఏర్పాటు చేశారు. తిరుమల పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుక వైపున ఔటర్ రింగ్‌రోడ్డు పక్కన అధునాతనమైన వంటశాలను రూ.13.45 కోట్ల వ్యయంతో నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్లో వంట, ఆహారధాన్యాలు, కూరగాయలు, పాలు, మొదటి అంతస్తులో ఆహార తయారీ, ఆవిరి ఆధారిత బాయిలర్లు, ఎగ్జాస్ట్ పద్ధతిలో ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు, గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవో అన్నప్రసాదం రాజేంద్ర, ప్రత్యేక క్యాటరింగ్ అధికారి జీఎల్ఎన్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు సాదర వీడ్కోలు

రేణిగుంట: తిరుమల శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, వకుళమాత కొత్త సెంట్రల్ కిచెన్ ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న సిఎం చంద్రబాబునాయుడు తన రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం నుంచి ఉదయం 11.53 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, అనంతపురం రేంజి డిఐజి షిమోషి బాజ్‌పాయ్, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు, జెసి శుభం బన్సల్, కమిషనర్ ఎన్.మౌర్య, ఎంఎల్ఎలు భానుప్రకాశ్, థామస్, ఆరణి శ్రీనివాసులు, అమరనాథ్‌రెడ్డి, మురళీమోహన్, బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, వర్థప్రసాద్ పాల్గొన్నారు.

అభిమాని కోర్కె తీర్చిన చంద్రబాబు

పుట్టుకతోనే ప్రత్యేక ప్రతిభావంతుడిగా జన్మించిన అతడికి అధినేత అంటే ప్రాణం... అతనితో ఫోటో దిగాలని కోరిక నేటికి తీరింది.... రేణిగుంట పట్టణానికి చెందిన ప్రసాద్ బాబు రోజా రాణి దంపతుల చిన్న కుమారుడు సురేంద్రబాబు పుట్టుకతోనే బుద్ధిమాంద్యంతో జన్మించాడు. ఇటీవల క్యాన్సర్ బారిన పడి తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికి పరిమితమయ్యాడు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఒక ఫోటో తీసుకోవాలన్న కోరిక కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేయడంతో కుటుంబ సభ్యులు స్థానిక పట్టణ నాయకుల సహాయంతో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శనివారం ఉదయం స్థానిక నాయకులు సురేంద్రబాబును, అతని కుటుంబ సభ్యులను తీసుకుని గ్యాలరీ వద్దకు చేరుకున్నారు. నేరుగా చంద్రబాబునాయుడు వచ్చి వీల్ ఛైర్ కే పరిమితమైన సురేంద్రబాబుతో కలిసి ఫోటో దిగడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. అదేవిధంగా అభిమాని చికిత్స కోసం అప్పటికప్పుడే ఐదు లక్షలు చెక్కును అందజేశారు.

వితంతువుకు రూ.50వేల ఆర్థిక సాయం

ప్రమాదంలో భర్తను కోల్పోయిన మహిళ కుటుంబానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 50 వేల రూపాయల ఆర్థిక సాయం చెక్కును కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అందజేశారు. విమానాశ్రయం వెలుపల అర్జీదారు కె.సుబ్రహ్మణ్యమ్మ ఎంఎల్ఎను కలిసి తన భర్త కె.ప్రసాద్ గత ఏడాది ఏప్రిల్‌లో యాక్సిడెంట్‌లో చనిపోయారని, ఆర్థికంగా చితికిపోయామని, ఇద్దరి పిల్లల్లో ఒకరి ఆరోగ్యం సరిగ్గా లేదని వాపోయారు. చలించిన సిఎం వారి కుటుంబానికి సత్వర సాయంగా రూ.50వేల చెక్కును ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

చంద్రబాబుకు రాజయాదవ్ సత్కారం

తిరుమల శ్రీవారికి బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పించడానికి వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఘనంగా సత్కరించారు. తిరుమల టిడిపి ప్రెసిడెంట్ సుధాల రాజయాదవ్ ఆధ్వర్యంలో శ్రీవారి చిత్రపటం బహుకరించారు. తిరుమలకు సంబంధించిన సమస్యల మీద వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి కోదూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఇది తారురోడ్డా..?

ప్రజాశక్తి- విజయపురం

మండలంలో పన్నూరు నుంచి పిచ్చాటూరు వెళ్లే తారురోడ్డు అధ్వాన్నంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి కమ్మకండ్రిగ ములుపు వద్ద తారురోడ్డు పూర్తిగా దెబ్బతింది. కొందరు తారు రోడ్డుపై మట్టి పొయ్యడంతో రోడ్డు బురదమయంగా మారింది. దీంతో పలువురు ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడి గాయాలైన సందర్భాలు ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




చిత్తూరు రూరల్

తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం


చిత్తూరు రూరల్ తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు ఆర్‌డిఓ కార్యాలయానికి మరమ్మతులు చేసి చిత్తూరు రూరల్ తహశీల్దార్ కార్యాలయానికి కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం చిత్తూరు పాత ఆర్‌డిఓ కార్యాలయంలో మరమ్మతులు చేసిన చిత్తూరు రూరల్ తహశీల్దార్ రూరల్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్, ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్, జేసి జి.విద్యాధరితో కలసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో చిత్తూరు రూరల్ మండలానికి తహశీల్దార్‌ను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు కార్యాలయం ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బంది కేటాయింపు జరిగిందని మరికొన్ని మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి అనంతరం 7వ తేదీ సోమవారం నుండి పూర్తిగా ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యాలయం ఏర్పాటుకు చిత్తూరు ఎంఎల్ఏ సహకారం అందించారని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు పట్టణాభివృద్ధిని ఆకాంక్షించి ఆర్థికసహాయం అందించదలచిన వారి కోసం చిత్తూరు డెవలప్మెంట్ ఇన్ఫ్రాఫండ్ పేరుతో బ్యాంక్ అకౌంట్ ప్రారంభించడం జరిగిందని, ఈ నిధులతో చారిత్రాత్మక విశేషం కలిగిన పాత తాలూకా పోలీసు స్టేషన్, పాత జెడ్పి భవనాలు, పిసిఆర్, కణ్ణన్ కళాశాలలను బాగు చేస్తామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, పారిశ్రామికవేత్తలు గమనించి ముందుకు రావాలన్నారు. చిత్తూరులోని చారిత్రాత్మక కట్టడాలను కాపాడుకోవడానికి, పట్టణ వైశిష్ట్యాన్ని వెలుగులోకి తీసుకురావడానికి ప్రజలు సూచనలను తెలియజేయవచ్చునని తెలిపారు. డిఆర్ఓ బి.పుల్లయ్య, ఆర్‌డిఓ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ, మేయర్ దొరబాబు, కఠారి హేమలత, చిత్తూరు రూరల్ తహశీల్దార్ లోకేశ్వరి, అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

వీ కోట సర్పంచ్ చెక్ పవర్ పునరుద్ధరణ



సర్పంచ్ లక్ష్మమ్మకు స్వాగతం పలికిన సిబ్బంది, ప్రజలు

ప్రజాశక్తి- వీ కోట: వీ కోట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పిఎన్.లక్ష్మమ్మ చెక్ పవర్‌ను పునరుద్ధరిస్తూ శనివారం చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల మండల కేంద్రమైన వి కోటలో చోటు చేసుకున్న ఇరు వర్గాల ఘర్షణ నేపథ్యంలో సర్పంచ్ పిఎన్.లక్ష్మమ్మ కుటుంబం ఓ వర్గానికి మద్దతు తెలిపారన్న ఫిర్యాదుతో కలెక్టర్ తాత్కాలికంగా సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దుచేసి ఆ బాధ్యతలను ఉప సర్పంచ్‌కు అప్పగించారు. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో వీకోట సర్పంచ్ అభ్యర్థన మేరకు ఘర్షణలలో సర్పంచ్ ప్రమేయం లేనందున మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మరల ఆమెకే చెక్ పవర్‌ను యధావిధిగా పునరుద్ధరిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ అభిమానులు ఆమె కార్యాలయానికి రావడంతో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చుతూ పూలమాలు వేసి ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ మాట్లాడుతూ తమ కుటుంబంపై అభిమానంతో గ్రామపంచాయతీ ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించారని వారి సేవే లక్ష్యంగా నిరంతరం పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటువంటి అపోహలు సహజమేనని వాస్తవాలు అధికారులు, ప్రజలు గ్రహించారని వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

'బ్రహ్మాండ' నాయకుని బ్రహ్మోత్సవం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఏడాదికి ఒకసారి తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలనే బ్రహ్మోత్సవం అంటారు. ఈ బ్రహ్మోత్సవాలు వీక్షించేందుకు దేశ నలుమూలే కాక విదేశాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు. ఈ ఉత్సవాల్లో ప్రతి రోజూ స్వామివారు ఉదయం, సాయంత్రం ఒక్కో రకమైన వాహనాల్లో తిరుమాఢవీధుల్లో విహరించి, భక్తులకు దర్శనం ఇస్తారు. కోట్లాది రూపాయలు వెచ్చించి టిటిడి ఈ బ్రహ్మోత్సవాలను అత్యంత ఆడంబరంగా నిర్వహిస్తుంది. బ్రహ్మోత్సవాల్లో విశిష్టమైనది గరుడ సేవ. సాదారణ రోజుల్లో స్వామివారిని లక్ష మంది దర్శించుకుంటే బ్రహ్మోత్సవాల్లో ఆలయం వెలుపల వాహనసేవల్లో విహరించే స్వామివారిని లక్షన్నర పైగా దర్శించుకుంటారు. అందులో గరుడ సేవ అంటే స్థానికులతో కలిసి సుమారు నాలుగైదు లక్షల మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం తిరుమలకు చేరుకుంటారు. పెరటాసి మాసం కావడంతో తమిళనాడు నుంచి అధికంగా భక్తులు గోవింద మాలదారణతో వందల కిలోమీటర్లు కాలినడకన తిరుమలకు చేరుకుంటారు. గరుడ సేవ రోజు ఈ తాకిడి మరింత అధికంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని గరుడ సేవకు ఒక రోజు ముందే తిరుమలకు ద్విచక్రవాహనాలను, ప్రయివేట్ వాహనాలను నిషేధిస్తారు. అయినా తిరుమల ఘాట్ రోడ్లలో రద్దీ తప్పదు. ప్రతి ఏడాదీ టిటిడి విజిలెన్స్, పోలీసులు కలిసి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు. అయినా భక్తులకు తొక్కిసలాటలు తప్పవు. ఉదయం నుంచి ఎండ, వానను సైతం లెక్కచేయకుండా అర్ధరాత్రి వరకు ఆలయ మాఢవీదుల్లో వేచి ఉండే భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్నా, పూర్తిస్తాయి సౌకర్యాలు ఉండకపోవడం భక్తులు అసౌకర్యానికి గురవుతుంటారు. వాహన సేవ ముగియగానే ఒక్కసారిగా భక్తులు వెళ్లేందుకు ప్రయత్నించడం మూలంగా కొంత తొక్కిసలాట చోటు చేసుకుంటుంది. గ్యాలరీలో ఉన్న భక్తుల మాట అటుంచితే వాహన సేవ ముందు అధికారులు, ప్రజాప్రతినిదులు, ప్రముఖులు వేల సంఖ్యలో ఉండటం, సిఫార్సుల ద్వారా విఐపి పాసులు అధికంగా పంచుతుండడంతో సాదారణ భక్తులకు స్వామి దర్శనం సక్రమంగా జరగడం లేదు. ఎలాగోలా గ్యాలరీలను దాటుకుని బయటపడిన భక్తులకు బస్సులు దొరకాలంటే అగచాట్లే, ఘాట్ రోడ్లు మొత్తం బస్సుల రద్దీ అధికంగా ఉంటుంది. ఇందుకు ప్రధాన కారణం విఐపిల వాహనాల అధికం కావడమే. ప్రతి ఏడాది గరుడ సేవకు భక్తులు ఇబ్బందులు పడుతున్నా వాటిని పూర్తిస్థాయిలో కట్టడి చేయడంలో అధికారులు కొంత అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాది జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా గరుడ సేవ 8వ తేదిన జరగనుంది. ఎప్పటి లాగే టిటిడి అందుకు తగ్గట్టు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ప్రకటించింది. ఎవ్వరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. పై పెచ్చు టిటిడి పాలకమండలి లేకపోవడంతో కొంత వరకు విఐపిల సిఫార్సుల తగ్గివచ్చుని భక్తులు భావిస్తున్నారు. ఈ ఏడాది గరుడసేవ రోజు విఐపిల తాకిడిని తగ్గించి, సామాన్య భక్తులకు స్వామివారిని ఎక్కువ సమయం దర్శించుకునేలా అధికారులు చర్యలు చేపడతారేమో అని భక్తులు భావిస్తున్నారు. అధికారుల తీరు ఎలా ఉండబోతుందో ఈ నెల 8వ తేది రాత్రి వరకు వేచి చూడాల్సిందే.



శ్రీకాళహస్తి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి చెందే విధంగా నిర్మాణాత్మక సహకారం అందిస్తామని కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్వగ్రామం ఊరందూరు గ్రామానికి కేంద్ర మంత్రి శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు కేంద్రమంత్రి కి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బొజ్జల ఇంట్లో ఆతిథ్యం స్వీకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్థానిక నాయకులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధికి బహుముఖ అవకాశం ఉన్న నియోజకవర్గమనీ, దీన్ని సమగ్ర అభివృద్ధి చేసేలా నిర్మాణాత్మక సహకారం అందిస్తామన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకష్ణారెడ్డి తో తన తండ్రి కి వున్న సన్నిహిత సంబంధాలను తాను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కొనసాగిస్తామని అన్నారు. ఎమ్మెల్యే కోరిక మేరకు ఢిల్లీ నుంచి తిరుపతి ఎయిర్పోర్ట్ కు డైరెక్ట్ కనెక్టివిటీ విమాన సర్విస్ తీసుకొచ్చామని, భవిష్యత్తులో దేశ , విదేశాల్లో నుంచి నేరుగా తిరుపతి ఎయిర్పోర్ట్ కు వచ్చే విధంగా పలు సర్వీసులను తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో డైరెక్ట్ కనెక్టివిటీ సర్వీసులను పెంచే విధంగా సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు.

'గల్ల పరీక్షలు తప్పనిసరి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి ఆదేశాలతో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ సంయుక్తంగా ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశంలో ఏడి ఏంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు తప్పనిసరిగా ప్రతి వారం ఓపికి వచ్చేవారిలో 10శాతం మందికి గల్ల పరీక్ష చేసి రిపోర్టులు పంపాన్నారు. గల్ల పరీక్షల నమోదు చాలా తక్కువగా ఉందని, కావున రెండు వారాలు మించి ఉన్న దగ్గు కేసులకు ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా గల్ల పరీక్షించి పాజిటివ్ వస్తే ఆరునెలల పాటు మందులు, పౌష్టికాహారం ఉచితంగా ఇవ్వాలని అన్నారు. అలాగే స్పర్శ లేని మచ్చలు అనుమానంగా ఉన్న కేసులను వైద్యాధికారి దగ్గర నిర్ధారణ చేయించి ఉచిత మందులు పంపిణీ చేయాలన్నారు. ప్రతి గురువారం అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఎపిడి మియాలజిస్ట్ శ్రీవాణి మాట్లాడుతూ ఐహెచ్ఐపిలో తప్పనిసరిగా ప్రతిరోజు ఎల్ ఫారం రిపోర్ట్ చేయాలన్నారు. జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారణకు ప్రతి పీహెచ్సీలో యాక్టివ్, పాసివ్ స్లైడ్స్ (రక్త పరీక్షలు) వారి టార్గెట్ ప్రకారం తప్పనిసరి పూర్తిచేయాలని, ల్యాబ్ పరీక్షలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. ఏఎన్ఎమ్స్ అందరికీ ఆర్డిటి కిడ్స్ ఇచ్చి అనుమానిత కేసులను పరీక్ష చేసి అవసరమైతే పిహెచ్సి రెఫర్ చేయాలని తెలపాలి. డెంగీపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఏఎంఓ రామచంద్ర రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్

నేడు పుంగనూరుకు మంత్రుల రాక

ప్రజాశక్తి- పుంగనూరు

చిన్నారి అస్పియా కుటుంబ సభ్యులను పరామర్శించడానికి పుంగనూరుకు రాష్ట్ర మంత్రులు విచ్చేయనున్నట్లు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణం ఉబేదుల్లా కాంపౌండ్‌కు చెందిన అజ్మతుల్లా కుమార్తె చిన్నారి అస్పియా మృతిపట్ల వారి కుటుంబీకులను పరామర్శించేందుకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర రవాణా శాఖ, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అబ్దుల్ షేక్ 6వ తేదీ ఆదివారం పుంగనూరుకు విచ్చేయునున్నట్లు చెప్పారు. కావున తెలుగుదేశం పార్టీ, బిజెపి, జనసేన కుటుంబ సభ్యులు కార్యకర్తలు, అభిమానులు ప్రతిఒక్కరూ ఉదయం 9 గంటలకు పుంగునూరు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ విచ్చేయవలసిందిగా కోరారు.

ప్రభుత్వం కాలయాపన చేస్తోంది: పెద్దిరెడ్డి

9న పుంగనూరుకు జగన్ మోహన్ రెడ్డి


అస్పియా కుటుంబాన్ని పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు : పట్టణంలో చిన్నారి అస్పియా మృతి చాలా బాధాకరమని, దోషులను పట్టుకోవడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అస్పియా కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి పరామర్శించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ పుంగనూరులో ఇలాంటి దారుణ ఘటన ఎప్పుడు జరగలేదన్నారు. ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి కిడ్నాప్, హత్య జరిగితే ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీనిపై సరైన విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించడంలో పోలీసులు అసమర్థతపై తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు. మదనపల్లి సబ్‌కలెక్టర్ ఫైల్స్ దగ్ధమైన ఘటనలో డిజిపి, సిఐడి అధికారులు ప్రత్యేక ఫ్లైట్, హెలికాప్టర్ ఇచ్చి పంపించారని ఈ చిన్నారి ఘటనపై పోలీసులు ఉన్నతాధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈనెల 9న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో పుంగనూరుకు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారని తెలిపారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పెద్దఎత్తున ఆందోళన చేపడతామని చెప్పారు. బాధిత కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. జగన్ మోహన్ రెడ్డి పరామర్శ అనంతరం పుంగనూరు నుంచి తిరుపతికు హెలికాప్టర్‌లో బయలుదేరి అక్కడి నుంచి విమానంలో విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారని తెలిపారు. వారి వెంట మాజీ ఎంపీ రెడ్డప్ప, మున్సిపల్ ఛైర్మన్ అలీమ్ బాష, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, షరీఫ్, త్యాగరాజు, ఆవుల అమర, ఎమ్మెస్ సలీం పాల్గొన్నారు.

మిస్ ఆంధ్రాకు ఘన సన్మానం

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ఇటీవల మిస్ ఆంధ్రాగా ఎన్నికైన కుప్పం నియోజకవర్గం, శాంతిపురం మండలం, ముల్లూరు కృష్ణాపురం గ్రామానికి చెందిన చందన జైరామ్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఘనంగా సన్మానించారు. కుప్పం పట్టణంలోని ఎన్టీఆర్ భవన్లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజకవర్గానికి చెందిన యువతి మిస్ ఆంధ్రాగా ఎన్నిక కావడం గర్వకారణమన్నారు. అనంతరం చందన మాట్లాడుతూ తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతగానో ఉందన్నారు. యువతులు అన్ని రంగాలలోనూ ముందుకు రావాలని ఆకాంక్షించ్చారు. నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు అనసూయ, భాగ్యలక్ష్మి త్రిలోక్, మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, కౌన్సిలర్ దాము పాల్గొన్నారు.



చందన జైరామ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

లెప్రసీ, టిబిపై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి ఆదేశాలతో జిల్లా టిబి, లెప్రసీ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం రెండవరోజు డిస్ట్రిక్ట్ టీమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని మిగిలిన వైద్యాధికారులకు అవగాహన కల్పించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా టిబి, లెప్రసీని 2030 నాటికి పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యంతో అందరూ పనిచేయాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు యాప్‌లో అప్లోడ్ చేయడంపై శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని డాక్టర్లు పిహెచ్‌సిలోని ఏఎన్ఎం, ఆశాలకు టిబి, లెప్రసీపైన పూర్తి అవగాహన కల్పించి యాప్‌లో వివరాలు అప్‌డేట్ చేయించాలని తెలిపారు. టిబి, లెప్రసీ నివారణకు అందరూ బాధ్యతతో కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంతోష్, జిల్లాలోని వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు మరో అవకాశం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు మరో అవకాశం కల్పిస్తున్నట్టు కళాశాల ప్రధానాచార్యులు వి. నారాయణ మూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బి.కామ్ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 4, బిఎ తెలుగులో 5, బిఎ ఎకనామిక్స్‌లో 8, బిఎస్సీ బొటనీలో 11, జువాలజీలో 12, కెమిస్ట్రీలో 21, కంప్యూటర్ సైన్స్‌లో 24 సీట్లు, ఫిజిక్స్‌లో 1 సీటు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటిని స్పాట్ అడ్మిమిషన్లతో భర్తీ చేయడం జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన ధృవీకరణ పత్రాలతో అక్టోబర్ 7వ తేదీ లోపు కళాశాలలో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 99636 99446, 76193 80767 నెంబర్లను సంప్రదించలన్నారు.

ఆర్థిక సాయం

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నింద్ర పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వినోద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. 2013 బ్యాచ్ తోటి కానిస్టేబుళ్లు కలిసి రూ.లక్ష ఆర్థికసాయంగా శనివారం నత్తం గ్రామానికి చెందిన వినోద్ భార్యకు అందజేశారు. తోటి ఉద్యోగికి ఆర్థిక సహాయం చేసిన కానిస్టేబుల్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

రామకుప్పం: మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో టిడిపి కార్యకర్త సదాశివయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, టిడిపి నేతలతో కలిసి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం దహన క్రియలకుగాను వారి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. చంద్రశేఖర్ రెడ్డి, పెరుమాళ్, సుబ్రహ్మణ్యం, చంద్రబాబు రెడ్డి, మోహన్, రామచంద్రారెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

డ్రై డే పాటించాలి

జిల్లా మలేరియా అధికారి



ప్రజాశక్తి- విజయపురం: ప్రతి శుక్రవారం అందరూ డ్రైడే పాటించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం ఆలపాకం కండ్రిగలో ఆయన పర్యాటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశు భ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, వ్యక్తిగత పరిశు భ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వచేరకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో గుంతలు ఏర్పడి నీళ్లు నిలిచినట్లయితే ఈగలు దోమలు చేరి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వర్షాలు కురుస్తున్న సందర్భంలో కాచివడపోసిన మంచినీటినే తాగాలని సూచించారు.

పిల్లలతో పనిచేయించడం నేరం



అవగాహన ర్యాలీలో జడ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పలమనేరు: 14 ఏళ్లలోపు చిన్నపిల్లలను పనులలో చేర్చుకోవడం చట్టరీత్య నేరమని పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జి పి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు చిన్న పిల్లలను హోటళ్లు, దుకాణాలు, వెల్డింగ్ షాపులు, ఇతర వాణిజ్య సముదాయాలలో పనులలో పెట్టుకోకూడదన్నారు. ఎవరైనా చిన్న పిల్లలను పనులను పెట్టుకుంటే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా పట్టణంలోని ఎంబిటీ రోడ్డు, ఆర్టీసీ డిపో, మదనపల్లి రోడ్డులో లేబర్ శాఖ అధికారులు, ఏఎస్ డబ్ల్యూ అధికారులు, చైల్డ్ అండ్ వెల్ఫేర్ అధికారులు పోలీసు సిబ్బందితో కలిసి చిన్న పిల్లలను పనులలో పెట్టుకోకూడదని ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

మనీషాకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలం కేంద్రంలోని మునినారాయణ కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న మనీషాకు శనివారం ఘనంగా వీడ్కోలు సమావేశం జరిగింది. గత మూడు సంవత్సరాల నుండి కళాశాలలో అంకితభావంగా పనిచేస్తూ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడంలో కృషి చేశారని కరస్పాండెంట్ మహేష్ కొనియాడారు. కళాశాలలో ఉత్తమ బోధన అందించి విద్యార్థులు మంచి మార్కులు సాధించడంలో బాగా కృషి చేశారని అన్నారు. అనంతరం ఆమెను శాలువతో ఘనంగా సత్కరించి వీడ్కోలు తెలిపారు.

సూళ్లూరుపేటలో వరల్డ్ స్పేస్ వీక్ ర్యాలీ

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అక్టోబర్ 4-10 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో భాగంగా శనివారం సూళ్లూరుపేటలో స్పేస్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక జూనియర్ కళాశాల ఆవరణం నుండి డి.ఓ.ఎస్ కాలనీ వరకు సాగిన స్పేస్ వాక్‌ను షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు,ఇస్రో ఉద్యోగులు ఈ స్పేస్ వాక్‌లో పాల్గొన్నారు. ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ ఈ ఏడాది వరల్డ్ స్పేస్ వీక్ సందర్భముగా స్పేస్ అండ్ క్లయిమేట్ చేంజ్ అనే నినాదం పెట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వాతావరణం లో వస్తున్న మార్పులు గురించి పౌరులు తీసుకొనవలసిన జాగ్రత్తలను గురించి అందరు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. షార్ కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

ఫైనల్‌కు క్రికెట్, వాలీబాల్ జట్లు



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శనివారం గుంటూరులో జరిగాయని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత తెలిపారు. జిల్లా తరపున రాష్ట్రస్థాయి ఫైనల్స్‌కు యుటిఎఫ్ క్రికెట్, వాలీబాల్ జట్లు చేరుకున్నాయని, వాలీబాల్ క్రీడా టీమ్ సభ్యులు బంగారుపాళ్యం మండలంకు చెందిన డి.బాలాజీ, పి.బాలాజీ, యాదమరి మండలానికి చెందిన సిరాజ్, బైరెడ్డిపల్లి మండలానికి చెందిన ఏ.బాలాజీ, పెద్దపంజాణికి చెందిన గురుప్రసాద్, తవణంపల్లి మండలానికి చెందిన వేణుగోపాల్, జీడి నెల్లూరుకు చెందిన లక్ష్మయ్య, వీకోటకు చెందిన అంజిబాబులు ఫైనల్స్‌లో తలపడి రాష్ట్రంలో మొదటి స్థానాన్ని సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. గెలుపొందిన వారికి డిసెంబర్ నెలలో కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ సభలో బహుమతుల పంపిణీ చేయనున్నట్టు ఆమె తెలిపారు.

సునీతకు సన్మానం



ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లెపల్లి సచివాలయంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న సుమతి శుక్రవారం హైదరాబాదులో మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సత్య హరిచంద్ర పద్యాల పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ స్థానం సాధించడంతో ప్రముఖ సినీహీరో వరుణ్ తేజ్ మనం ఫౌండేషన్ ఛైర్మన్ చక్రవర్తి చేతుల మీదుగా ఉత్తమ గాయని అవార్డు అందుకున్నారు.

సుబ్బారెడ్డి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండలం మాజీ వైస్ఎంపీపీ, వైసిపి నాయకులు దివంగత నేత సుబ్బారెడ్డి విగ్రహ ఆవిష్కరణ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన రెండవ వర్ధంతి సందర్భంగా విగ్రహ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగాఆయన సతీమణి గౌహతి రెడ్డి మాట్లాడుతూ తన భర్త అడుగుజాడల్లోనే తన కుటుంబాన్ని నమ్ముకున్న ప్రజలకు అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. సుబ్బారెడ్డి భౌతికంగా దూరమైన ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారన్నారు. విగ్రహ ఆవిష్కరణలో భాగంగా భారీగా విచ్చేసిన ప్రజలు సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడ్డారు. వారి కుమారులు గుణేశ్వర్ రెడ్డి, తేజేశ్వర్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ కుమారి, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మూడోరోజు అన్నపూర్ణ దేవిగా..

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం: మండలంలోని ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన అరిమానిగంగమ్మ తల్లి దసరా ఉత్సవాలలో భాగంగా మూడవ రోజైన శనివారం శ్రీఅన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దాతలుగా జయకుమార్, యోగేశ్వరి వారి కుమార్తెలు రక్ష, ఉభయ వ్యవహరించారు. భక్తులకు రిటైర్డ్ ఎస్ఐ గోపాల్ రెడ్డి, జీవరత్నమ్మ అన్నదానం చేశారు.

బంగారుపాళ్యం: మండలంలోని బొమ్మయపల్లి పంచాయతీ వజ్రాలపురం బోయకొండ గంగమ్మ దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం అన్నపూర్ణాదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయదారులుగా తగ్గువారిపల్లి పంచాయతీకి చెందిన నాగరత్నమ్మ, జనార్ధన్ నాయుడు వ్యవహరించారు. మండల కేంద్రంలోని ముత్యాలమ్మ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

పలమనేరు: పట్టణంలోని పాతపేటలోని సత్య గంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : మండలం ఉర్లఓపనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం శ్రీవారి కళ్యాణం కనుల పండుగగా జరిగింది. టిటిడి ఆధ్వర్యంలో బేటరాయస్వామి ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో జరిగిన శ్రీవారి కల్యాణోత్సవానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సంప్రదాయ పద్ధతిలో పట్టు వస్త్రాలను సమర్పించారు. వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలను అందించారు. విజయ డెయిరీ, కృష్ణ మిల్క్ యూనియన్ వారు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవ అనంతరం అశేష భక్తజనం వేట వెంకటేశ్వర స్వామి దర్శనార్థం కొండపైకి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

విజలాపురంలో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో శనివారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 55 మందికి కంటి ఆపరేషన్ల కొరకు కోలార్ జిల్లాలోని శంకర్ నేత్రాలయకు రెఫర్ చేశారు. ఎన్టీఆర్ కంటి వైద్యశిబిరంలో చికిత్సలు పొందిన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూజిత, టిడిపి నేతలు శ్రీనివాసులరెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, భువన్, ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.



నిర్దేశించుకున్న మార్గం వైపు ధైర్యంగా వెళ్లండి

ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్థానిక ఆర్‌కె డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెలే మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌరులుగా సమాజానికి ఉపయోగపడేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. సమాజం పట్ల అవగాహన మంచి అలవాట్లు సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ బద్రి నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించేలా కష్టపడి చదవాలన్నారు. సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటా చలపతి మాట్లాడుతూ ఐటి రంగంలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అందుకు కావాల్సిన నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఫ్రెషర్స్ డే పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గురజాల

రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సంక్షేమ నిధి



ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని రైతులందరికీ వారు వేసే పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ఎంఎఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వినాయక రెడ్డి అన్నారు. శనివారం బట్టందొడ్డి పంచాయతీ శ్రీరామపురం గ్రామంలో నాబార్డ్, ఏపీ ఎంఎఎస్ సహకారంతో పాలేఖర్ రైతు సంఘం ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సంఘం ఏర్పాటు చేయడానికి ముఖ్యం ఉద్దేశం ఈ ప్రాంతంలో ఉన్న రైతాంగాన్ని ఒక సంఘంగా ఏర్పాటు చేసి ఈ సంఘంలో చేరడానికి సభ్యత్వ రుసుము రూ.1100లు నిర్ణయించడం జరిగిందన్నారు. ఈసంఘంలో చేరిన రైతులకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందచేస్తున్న సబ్సిడీలను అందించడంతో పాటు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించి రైతు ఉత్పత్తి చేసిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు కల్పించి మార్కెటింగ్ చేయించడమే ముఖ్యం ఉద్దేశమని అన్నారు. క్రాప్ హుస్బేండ్రి స్పెషలిస్ట్ దేవకీ, టిడిపి అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, మిట్టపల్లి శ్రీరాములు, నగరత్న, నాగరాజు మిట్టపల్లి, ప్రవీణ, భానుప్రతాప్ రెడ్డి, చంద్రశేఖర్, మోహన్ రెడ్డి, రవి శేఖర్, కృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

ఏచూరి బాటలో నడుద్దాం

ప్రజాశక్తి - నాయుడుపేట



ఏచూరికి నేతల నివాళి

సీతారాం ఏచూరి బాటలో నడవడమే ఏచూరికి అసలైన నివాళి' అని వక్తలు ఉద్ఘాటించారు. నాయుడుపేట అంబేద్కర్ బొమ్మ నుంచి సిఐటియు ఆఫీసు వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వేదనపత్తి సుందర్ రామిరెడ్డి భవన్‌లో సిఐటియు కార్యాలయంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవితం ఆదర్శప్రాయం అని, ఆయన విద్యార్థి దశలో దేశంలోనే మొదటి స్థానం సంపాదించి తన కోసం కాకుండా దేశం కోసం, దేశ ప్రజల కోసం తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి, కమ్యూనిస్టు పార్టీలో చేరి పేద బడుగు వర్గాల అభ్యున్నతికి కషి చేశారన్నారు. ఒక తెలుగువాడైయుండి జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనిస్టులకు వన్నెతెచ్చాడని, ఆయన నడవడిక ప్రతి ఒక్క కమ్యూనిస్టుకి ఆదర్శప్రాయమని, ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందని ఆయన సేవలను కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ అమెరికా ప్రెసిడెంట్, భారత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ లాంటి వారితో విభేదించి పోరాడిన వ్యక్తి అని, అద్వానీ లాంటివారు సీతారాం ఏచూరి ప్రసంగాలను వింటుండే వాన్ని అని స్వయంగా తెలియజేశారని, చివరి దశలో తన శరీరాన్ని వైద్య పరిశోధనల కోసం ఇచ్చిన మహనీయుడు అని కొనియాడారు. టిడిపి సీనియర్ నేత శరసనంభేటీ, విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు అట్టడుగు వర్గాల తరపున పోరాడుతున్నారని, వారి పోరాటాలు రాజకీయాలకు అతీతంగా తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని, అయితే ఈ పోరాటాలు శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. పాలకపక్షం సరిగా పని చేయాలంటే సరియైన ప్రతిపక్షం ఉండాలని, అప్పుడే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఒక నిజాయితీ గల ప్రతిపక్షం అంటే అధికార పక్ష నాయకులు ఏది చేసిన తప్పు పట్టకుండా వారు చేస్తున్న పాలనలో పేదవారికి మేలు చేసే వాటిని సూచిస్తూ ఇబ్బందికరమైన వాటిని వ్యతిరేకిస్తూ శాంతియుతమైన పోరాటాలు కొనసాగించాలని ఆశించారు. భావి భారత నిర్మాణంలో కమ్యూనిస్టులు పెద్దన్న పాత్ర పోషించారని, పుచ్చలపల్లి సుందరయ్య, సీతారాం ఏచూరి లాంటి మహనీయులు ఎందరో తమ పోరాటాలతో స్ఫూర్తినింపారని కొనియాడారు. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా కమ్యూనిస్టులు తమ పంథా మరింత మెరుగుపరచుకొని బలమైన ప్రతిపక్షంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ వై.రామసుబ్బయ్య మాట్లాడుతూ పేద బలహీన వర్గాల ప్రజలు ప్రశాంతంగా ఉన్నారంటే కమ్యూనిస్టు పార్టీలో సీతారాం ఏచూరి లాంటి త్యాగాలు చేసిన మహనీయులు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మి, సుధాకర్, యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, సుబ్బారావు, అంగన్వాడి శ్యామలమ్మ, ఆశ సుజాత, మధ్యాహ్న భోజన కార్మికురాలు విజయమ్మ, గిరిజన సంఘం సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ మహేష్ బాబు, శివకవి ముకుంద పాల్గొన్నారు.

ముగిసిన వైద్య విద్యార్థుల క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ఎస్ వి వైద్య కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహించిన స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ముగిసింది. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, నేషనల్ మెడికల్ కమిషన్ న్యూఢిల్లీ వారి ఆదేశాలతో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి ఏ చంద్రశేఖరన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ క్రికెట్ టోర్నమెంటు ఆఖరి రోజు హోరాహోరీగా సాగింది. నారాయణ వైద్య కళాశాల నెల్లూరు, జేమ్స్ వైద్య కళాశాల శ్రీకాకుళం ఫైనల్స్ లో నిలవగా నారాయణ వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థులు విజేతలుగా నిలిచారు. మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ గా ఎన్ఆర్ఐ వైద్య కళాశాల, చిన్న కాకాని, గుంటూరు, పీజీ వైద్య విద్యార్థి డాక్టర్ వినీత్ అవార్డులను అందుకున్నారు. ఫైనల్ లో విజేతగా నిలిచి క్రికెట్ కప్ సాధించిన నారాయణ వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థులు వారి కేరింతలతో ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ తులసీరామ్, డాక్టర్ పాహీం, పూర్వ వైద్య విద్యార్థులు డాక్టర్ మదన్మోహన్ రెడ్డి, డాక్టర్ సుజిత్, డాక్టర్ వినోద్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ త్రిమూర్తులు, ఎస్వీ వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శరవనన్ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

రెచ్చిపోయిన ఇసుక మాఫియా

- అడ్డగించిన వారిపై దాడులు - ఆసుపత్రి పాలైన బాధితులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణ పరిధిలోని పరమసముద్రం ప్రాంతానికి చెందిన విజయ్ కుమార్‌పై అదే గ్రామానికి చెందిన మునస్వామి కుటుంబీకులు దాడి చేశారని బాధితుడు తెలిపారు. ఈ దాడిలో గాయపడ్డ బాధితుడు కుప్పం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుని వివరాల మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పరమ సముద్రం చెరువు పక్కన ఉన్న హంద్రీనీవా కాలువకు పక్కనే తమకు వ్యవసాయ భూమి ఉందని, సదరు భూమికి ఆనుకుని మునస్వామి కుటుంబ సభ్యులు తమ సొంత భూమిలో అక్రమఇసుక దందా నడుపుతున్నట్టు తెలిపారు. ఇందుకోసం చెరువులోని మట్టిని తీసుకోవడమే కాకుండా అక్రమ విద్యుత్‌ను సైతం వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఈ విద్యుత్ కనెక్షన్ భూమి గుండా నేలపై విద్యుత్ వైర్లు తీసుకెళ్లారని, గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల వద్దకు వెళ్లిన తమ కుటుంబ సభ్యులు విద్యుత్ ప్రమాదానికి గురికావడం జరిగిందన్నారు. దీంతో భయాందోళనలకు చెందిన బాధితులు అక్రమ ఇసుక దందా నడుపుతున్న మునస్వామి కుటుంబీకులను ప్రశ్నించడం జరిగిందన్నారు. ఆగ్రహించిన మునస్వామి అతని కుమారులు రామరాజు, బాలకృష్ణ ప్రశ్నించిన వారిపై దాడులకు తెగబడ్డట్టు తెలిపారు. ఈ దాడులలో విజయ్ కుమార్ కుడి చేయి ఎముక తీవ్రంగా దెబ్బతినిందని, అయినా శాంతించని అక్రమార్కులు తమ అక్రమవ్యాపారాలకు ప్రాణాలు తీస్తామని బెదిరించినట్టు బాధితుడు తెలిపారు. ఈ విషయమై కుప్పం పోలీసులను ఆశ్రయించామని, పోలీసు వారు తగు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు విజయ్ కుమార్



వ్యవసాయ భూమి వద్ద జరిగిన దాడులు

21 మందికి జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు శుక్రవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 21 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తంగా రూ.2,10,000ల జరిమానా విధించడం జరిగింది. ఈ సంవత్సరం పది నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 360 మందికి సుమారు రూ.30.7లక్షల ఫైన్ విధించడం జరిగింది. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి- పుంగనూరు



పట్టణంలోని వెల్డింగ్ షాప్‌లో పనిచేస్తున్న ఓ యువకుడు గత మూడు రోజులుగా కనపడడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం శ్రీనివాసపురంకు చెందిన వసీం కుమారుడు జుబేర్ (16) పుంగనూరులో వారి అమ్మమ్మ పర్వీన్ తాజ్ ఇంటిలో ఉంటూ ఓ వెల్డింగ్ షాపులో దినసరి కూలీలు వెళ్లేవాడు. ఎప్పటిలాగానే 2వ తేదీ బుధవారం వెల్డింగ్ షాప్‌కు పనికి వెళుతున్నట్లు ఇంటిదగ్గర చెప్పి వెళ్లాడు. అయితే షాప్‌కు పనికి వెళ్లలేదని ఇంటికి రాలేదని మూడు రోజుల తర్వాత అన్ని ప్రాంతాల్లో చూసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం వ్యాపారాల నిర్వహిస్తే అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీ.ఐ శిరీషాదేవి తెలిపారు. శనివారం కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా శిరీషా దేవీ బాధ్యతలు చేపట్టారు. సిఐ మాట్లాడుతూ కార్వేటినగరం సర్కిల్ కార్యాలయంలో పరిధిలోని మండలాలు తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ఉండడం వల్ల అక్రమ మద్యం వ్యాపారాలు జరిగే అవకాశాలు ఉంటుందని, అరికట్టేందుకు సరిహద్దులో ఎక్కువ నిఘా ఉంచి అక్రమ మద్యంను గుర్తించి కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో సారా అమ్మకాలు, తయారీలు, బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిసిన వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించి నేరాలను అరికట్టేందుకు ముందుకు రావాలని సూచించారు. సిబ్బంది నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సిఐని శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఎస్ఐలు శ్రావణ కుమార్, మొసస్, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపట్టిన శిరీషాదేవీ

చెరువుల్లో 'మెగా' అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి-శ్రీకాళాహస్తి



తొట్టంబేడు-పెళ్లకూరు మండలాల సరిహద్దుల్లోని చెరువుల్లో మెగా అక్రమ తవ్వకాలు మొదలయ్యాయి. పెళ్ళకూరు మండలంలోని నెలబల్లి చెరువు, తొట్టంబేడు మండలంలోని లింగమనాయుడుపల్లి చెరువుల్లో వారం రోజులుగా భారీ హిటాచీలు పెట్టి పగలూ రాత్రి తేడా లేకుండా తవ్వకాలు చేస్తున్నారు. ఆ మట్టిని భారీ టిప్పర్ల సాయంతో మదనపల్లి-నాయుడు పేట జాతీయ రహదారి విస్తరణ పనుల నిమిత్తం తరలిస్తున్నారు. భారీ టిప్పర్ల సాయంతో మట్టిని తరలించే క్రమంలో రహదారులు ఛిద్రమవుతున్నాయనీ, రాత్రిళ్ళు నిద్ర కూడా పట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. చెరువుల్లో మెగా అక్రమ తవ్వకాలు, మట్టి తరలింపుపై గ్రామస్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ఖాతరు చేయడం లేదని సమాచారం. ప్రశ్నిస్తే మాకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి అనుమతులున్నాయంటూ గ్రామస్తులపైనే ఎదురుదాడికి దిగుతున్న పరిస్థితి. విషయం సంబంధిత అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కూటమి నేతల అండ పుష్కలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. చెరువుల్లో మట్టి తవ్వితే అడిగేవారెవరులే అన్న ధీమాతో లోయల్ని తలపించేలా గుంతలు తవ్వేస్తున్న వైనం. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాకాలం గుంతల్లో నీరు చేరినప్పుడు లోతు తెలియక అమాయకులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పశువులు కూడా మత్యువాత పడే అవకాశం ఉంది. సాధారణంగా చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులిస్తే నిబంధనల ప్రకారం మూడున్నర అడుగులకు మించి లోతులో మట్టి తీయకూడదు. కానీ మెగా యాజమాన్యం మాత్రం తాటిమాను లోతులో గుంతలు తీసేస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువుల్లో మెగా అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై తొట్టంబేడు తహశీల్దార్ మధుసూదన్ రావును వివరణ కోరగా అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.